కీ.శే. మేకా సత్యనారాయణ శాస్త్రి (బాంబు) రెండవ వర్ధంతి సందర్భంగా...

# ఇరువురు ఏకవ్యక్తి సైన్యాలు

( విశిష్ఠ భావోద్యమ దంపతుల పరిచయం )



## యాళ్ళ సూర్యనారాయణ, సరస్వతమ్మ దంపతులు


ప్రచురణ

కీ.శే.మేకా సత్యనారాయణ శాస్త్రి (బాంబు)

స్మారక సమితి, పిఠాపురం

# యాళ్ళ సూర్యనారాయణ, సరస్వతమ్మ

## ఇరువురు ఏకవ్యక్తి సైన్యాలు

(విశిష్ఠ భావోద్యమ దంపతుల పరిచయం)

సంకలనం & సంపాదకత్వం

**గౌరవ్**

ఫిబ్రవరి 02, 2024

బుక్ సెట్టింగ్ సహకారం

**అవధానం శివప్రసన్నకుమార్**

**విజ్ఞప్తి**

**ఇందులోని వ్యాసాల్లోని అభిప్రాయాలు**
**అన్నిటితోనూ సంపాదకులు, ప్రచురణకర్తలు**
**అంగీకరించాల్సిన అవసరం లేదు.**

**మూల్యం**

**అమూల్యం (సాఫ్ట్ కాపీ మాత్రమే)**

**వివరాలకు**

gouravmeka@gmail.com

# అవిస్మరణీయ స్వరాలకి మరణం లేదు !

జీవించిన కాలానికి న్యాయం చేయగలిగే వ్యక్తులు కొందరుం టారు. మరణించిన తర్వాత కూడా వాళ్ళు జీవిస్తారు. మృత వ్యవస్థలు మినహా చైతన్యవంతమైన సమాజాల్లో వారికి ఎక్కడోక జ్ఞాపకముం టుంది. నిర్జన సమూహాల్లో తప్పా ప్రజాతంత్ర ప్రవాహాల్లో అలాంటి వారికి ఎప్పటికీ స్థానముంటుంది. కొత్తకలలతో కాలానికి ఎదురీదిన వాళ్ళ దారుల్ని ప్రతితరం స్మరిస్తూనే ఉం టుంది. వ్యక్తిగత స్వార్థాన్ని అధిగమించి వ్యవస్థ కోసం పాటుపడిన వాళ్ళ త్యాగాల్ని కంచె మీదొక పక్షి గుర్తుచేస్తూనే ఉంటుంది. ఎందుకంటే, వాళ్ళు మనిషి ఉన్నతి కోసం ఉద్దేశించిన ఉత్తేజ తరంగాలు. మానవాళి సమున్నతను కాంక్షించిన మానవీయ బంధా లు.ఎల్లలు లేని విశ్వమానవ కళ్యాణం కోసం స్వప్నించి నిష్క్రమించిన అవిస్మరణీయ స్వరాలు.

యాళ్ళ సూర్యనారాయణ,సర స్వతమ్మ. ఈసరికే మనమంతా మర్చిపోయిన వ్యక్తుల పేర్లు. ఉత్తరాంధ్రలో పార్వతీపురంలో అద్వితీయమైన భావోద్యమ విశిష్ట ఆశ్రమ స్థాపకులుగా నిజానికి చరిత్రలో నమోదవ్వ ల్సిన వారు,అన్యాయంగా అనామ ధేయంగా కాలగర్భం లో కల్సి పోవడం చారిత్రక విషాదం. 'మూఢనమ్మకాల నిరోధక చట్టం ముసాయిదా బిల్లు' చిత్తుప్రతిని ప్రచురించి ఊరూరా తిరిగి పంచిన ఆయన్ని ఈరోజు ఏ వైజ్ఞానిక సైన్స్ ప్రచారోద్యమ సంస్థలూ కూడా సొంతం చేసుకోక పోవడం స్వతంత్ర ఆలోచనా పరుల పట్ల అమలవుతున్న అంటరాని తనానికి బలమైన సంకేతం. ఏ కాలమాన పరిస్థితుల్లోను ఇది ఏ సమాజానికీ వాంఛ నీయం కాదు. ప్రజాసంఘాల విషయం లో క్షమించరాని నేరం.

అయినప్పటికీ ఈసరికే వాళ్ళి ద్దరూ మరుగున పడి పోయారు. ఎవరకీ కాకుండా ఐపోయారు. ఎన్నో ఆశలతో నిర్మించిన అద్భుతమైన ఆశ్రమం ఎందుకూ కొర గాకుండా పోయింది. బతికున్న కాలంలో వాళ్ళ చందాలు పొందని పత్రిక గానీ,విరాళాలు తీసుకోని సంస్థగానీ లేవంటే అతిశయోక్తి కాదు. ఐనా, ఈరోజు వాళ్ళ ప్రస్తావన తీసుకొచ్చే వారు తక్కువే. దాదావుగా లేరని చెప్పొచ్చు. అందుకే, మరుగునపడిన స్వప్నాలకి చోటు కల్పించడం కోసం మావంతు చేస్తున్న ఈ సహృద్భావ ప్రయత్నం. ప్రజాపక్ష బుద్ధిజీవి, సామాజిక కార్తకర్త, 'శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించు దాతృత్వ సంస్థ' స్థాపకులు కీ. శే. యాళ్ళ సూర్యనారాయణ, సరస్వత మ్మ దంపతుల్ని గూర్చి వివిధ సందర్భాలలో సామాజిక మాధ్యమాల్లో రాసిన వ్యాసాల్ని ఇలా ఒక్కదరికి చేర్చడం జరిగింది.

ఇది సమగ్రం కాదు. ఆయన సన్నిహితు లు, అభిమానులు కనుక పూనుకుంటే ఆయన కోసం త్వరలోనే ఒక వ్యాస సంకలనం తీసుకువద్దామని ఉంది. అలాగే, ఆయన స్థాపించిన ఆశ్రమాన్ని పరిరక్షించి ప్రభుత్వ సారథ్యం లో ఆయన స్మారక చిహ్నం, గ్రంథాలయం ఏర్పాటు చేసే దిశగా ప్రయత్నాలు చేయాలనే ఉంది కానీ ఎంత వరకు సఫలీకృతం అవు తాయో చూడాలి.ఈ కృతి ఇలా రావడానికి సహకరించిన మిత్రులు శివప్రసన్నకుమార్, శ్రీకాంత్ శర్మలకి కృతజ్ఞతలు. ఇది చదివిన ఎవరైనా ఆయన ఆశయాలకి అద్దంపట్టేలా అర్థవంతమైన స్ఫూర్తిని పొందగలిగితే ఈ అక్షరాలకు అంతకుమించిన సార్థకత ఉండబోదు. విమర్శలకు ఆహ్వానం.

– గౌరవ్

# ఏటికెదురీదిన ఏక వ్యక్తి సైన్యం

**యాళ్ల సూర్యనారాయణ జీవితం**



2007 సం॥ ఏప్రిల్ నెల మొదటివారం, ఉదయం 10:40ఉత్తరాంధ్ర జిల్లా, పార్వతీపురంలోని బెల్గాం పోస్టాఫీసునుండి సుమారు అరకిలోమీటరు మేర రోడ్డంతా రక్తసిక్తమయింది. 65 సం॥వరాల వృద్ధుడుపై ఆగంతకులుచేసిన హత్యాప్రయత్నం ఆ ప్రాంతంలో సంచలనమైంది. పోస్టాఫీసులో సొమ్ము కడదామని వచ్చిన అతనిపై వెనుక నుండి బలమైన ఆయుధంతోఎంత తీవ్రమైన దాడి జరిగిందంటే, మొదటి దెబ్బకే పూర్తిగా స్పృహ కోల్పోయిరక్తం కక్కుతూ నేలరాలింది ఆ బక్కప్రాణం. చచ్చాడనుకుని వొదిలి వెళ్ళిపోయారా ముష్కరులు. ఒక ఉపాధ్యాయ మిత్రుడు చూసి రిక్షాలో ఆ శరీరాన్ని పెట్టి ఇంటికిపంపాడు. రోడ్డంతా నెత్తుటి అభిషేకం చేస్తూనే ఇంటికి చేరిందా దేహం. కొనఊపిరితో కొట్టుమిట్టాడుతున్న ఆ కాయాన్ని వైజాగ్ కె.జి. హెచ్కి తరలించిందికట్టుకున్న సరస్వతమ్మ. 10 రోజులు కోమాలో ఉన్న ఆ శరీరం స్పృహ వచ్చినమరుక్షణం మిత్రులమాట లెక్కచేయక అప్పటికప్పుడే మళ్ళీ రోడ్డెక్కింది.ఆ శరీరం చైతన్యానికి చిహ్నం. ఆ దేహం జాతికే గర్వం. ఆయనే యాళ్ళ సూర్యనారాయణ. మహారాష్ట్రలో దభోల్కర్ను హత్యచేస్తే మధనపడిపోయిన మన భావోద్యమపత్రికలు, కర్నాటకలో కల్బుర్గిని చంపితే కాకావికల మయిపోయిన ప్రగతిశీలసంఘాలు అంతకు అర్ధదశాబ్దం ముందే ఆంధ్రరాష్ట్రంలో నాస్తిక హేతువాద ప్రగతిశీలవ్యక్తులకూ, పత్రికలకూ, సంఘాలకూ నిత్యపోషకుడిగా ఎన్నో సంవత్సరాల్నుంచి ఉన్న ఆ 'వృద్ధుడి'పై జరిగిన దాడిని ఖండించలేదు సరికదా కనీసం స్పందించ లేదు. వ్యక్తులకు అండగా నిలవాలన్నా కూడా అతడి సాంఘికస్థాయి పెద్దదైవుండాలన్న మాట. ఏ డాక్టరో, కలెక్టరో, యూనివర్శిటీ ప్రొఫెసరో అయితే కానీ, అగ్రకుల గజ్జిని అంటించుకుంటేనే గానీ ఒక వ్యక్తి మన సంఘాల దృష్టిలో ఉద్యమకారుడు అవడన్న మాట!

ఆస్తిక ఛాందస రూపులు మారి నాస్తిక ఛాందసత్వం పెరిగి పురుషాధిపత్యపు వాసన, ఎదుటివార్ని పూర్తిగా నమ్మని లక్షణం ఆయన్నింకా వొదల్నప్పటికీ, దేశంలోనే అతి పెద్దదైన పార్వతీపురం కుట్ర కేసులో ముద్దాయైన ఆయన కోటీశ్వరులు మొదలుకొని జిల్లా కలెక్టర్లు, సబ్కలెక్టర్లు, తహశీల్దార్లు,

పోస్టాఫీసు, గ్యాస్, విద్యుత్తు శాఖలు.. అన్యాయం ఎక్కడ కనిపించినా వదలకుండా న్యాయపోరాటం చేసాడాయన. చివరికి ఒక ప్రగతిశీల పుస్తకాలయం 18 రూపాయలు ఎమ్.ఓ., చేస్తే పుస్తకం పంపలేదని వినియోగదారుల కోర్టులో దావా వేసి 3000 ఖర్చుపెట్టి విజయం సాధించిన ఆయన్ని ఎలా అర్థం చేసుకోవాలి? పెట్టుబడిదారీ పాలక వర్గాలకు వత్తాసు పలకని ఈ దంపతులిద్దరూ తమ ఓటు జీవితంలో ఒక్కసారి కూడా వేయలేదంటే దాన్ని ఎలా తీసుకోవాలి?

50 సంవత్సరాల అలుపెరుగని ఉద్యమ జీవితమతనిది. ప్రగతిశీల సంఘాలన్నింటికీ కలగలిపి పది లక్షలకు పైగా వెచ్చించిన చరిత్ర ఆయనది.

భావోద్యమ పత్రికలన్నింటికీ కట్టకలిపి తానే కాక ఎంతోమంది వ్యక్తుల్నీ, గ్రంథాలయాల్నీ చందాకట్టి చేర్పించిన యావ ఆయనది.

రెండు భయంకరమైన ప్రధాన మతాల ధాటికి ఎదురొగ్గి వారి అడ్డాలోనే 'శాస్త్రీయ ఆలోచనల్ని పెంపొందించే దాతృత్వ సంస్థను' స్థాపించిన చేవ ఆయనది. ఎంతోమంది యువమిత్రులు మొదలుకుని పాత్రికేయ మిత్రుల వరకూ ఎన్నో గ్రంథాల ప్రచురణకు, కార్యక్రమాల నిర్వహణకు ఆర్థికంగా వెన్నుతట్టిన చెయ్యి ఆయనది.

ఆంధ్రా యూనివర్శిటీ మొదలుకుని ఉత్తరాంధ్రలో సుమారు 120కి పైగా గ్రంథాలయాలకు అమూల్యమైన, అపురూప గ్రంథాల్ని లక్షల సంఖ్యలో అందిచ్చిన హార్దిక ఔన్నత్యమాయనది. ఒక్కొక్క కేసుకీ లక్షలవుతున్నా దాదాపు పాతిక కేసుల్ని ఒంటిచేత్తో ఎదురుకున్న గాథ ఆయనది.

ఎన్నో దాడులు, బెదిరింపులు ఎదుర్కొంటూ కూడా ఉన్నదున్నట్లు మొహంమీద మాట్లాడే ఆయన తత్వం, ఎంతోమందికి స్ఫూర్తయితే, కొంతమంది దొంగలకు సహజంగానే ఈర్ష్యాద్వేషం.

ఉద్యమాల పేరు చెప్పి ఎదుటివాడి సొమ్మునంతా హారతి కర్పూరంలా అర్పేసే చీల్పుడు సంస్థల బారినపడి కూడా ఇంకా వాటికి అండదండలిచ్చిన బాధిత అమాయకుడు.

పత్రికల పేరుతో పబ్బం గడుపుకుంటూ పాఠకుల్ని వెర్రివెంగళప్పల్లా జమకట్టి అభ్యుదయం పేరుతో అక్షరాల్ని ఆడంబరంగా అమ్ముకుంటున్న దండగమారి సంతలకు కూడా దండిగా విరాళాలిచ్చిన వితరణశీలి.

యావత్ దేశంలోనే అరుదైన భౌతికవాద దృక్పథంతో కూడిన శాస్త్రీయాలోచనా ఆశ్రమాన్ని 18 మంది మహనీయుల విగ్రహాలతో స్థాపించి నడిపించిన అనితర సాధ్యుడు, యాళ్ళ సూర్యనారాయణ.

2006, జూన్లో రాష్ట్ర స్థాయిలో మూఢ నమ్మకాల వ్యతిరేక సదస్సును 3 రోజుల పాటు జరిపిన దంపతులు వారు. జాతీయ FIRA ప్రతినిధుల్ని కల్సి వారి సభలకయ్యే ఖర్చంతా పెట్టుకుంటానన్న సూర్యనారాయణను పిచ్చివాడిలా చూసారా బృందాలు. సమాజానికి ఉపయోగపడే ఏ సంఘ కార్యక్రమాన్నైనా సరే ఖర్చునంతా తానే భరించి స్థలమిచ్చి, భోజన, వసతి ఏర్పాట్లు చేసి పెట్టుకొమ్మన్నా ముందుకురాని కుక్కమూతి పిందె సంఘాల కుహనా ప్రవర్తనను ఏమనాలి?

ఐనా ఆయనూరుకోలేదు. నిరుత్సాహాన్ని దరిచేరనివ్వలేదు. దేశంలో ప్రజలకోసం పెట్టే ఏ కార్యక్రమానికైనా తప్పనిసరిగా హాజరై

తనవంతు తోడ్పడేవారు. ప్రతినెలా బాధితులకు ఆహార ధాన్యాల్నో, ఆరోగ్యసంబంధ మందుల్నో ఉచితంగా కొని పంచేవారు. ఊతకర్రసాయం కూడా లేకుండా ఏడుపదుల వయసులో కూడా ఉద్యమాలపై ఆయనకున్న విశ్వాసాన్ని, నిబద్ధతను చూచి ముచ్చటపడకుండా ఉండలేం. ఆయనో నిత్య ఉద్యమకారుడు. అనేక అభ్యుదయ శాస్త్రీయ, నాస్తిక, సైన్స్ హేతువాద, భౌతికవాద, స్వేచ్ఛాలోచనా సంఘాలకు పత్రికలకు ఆయనో నిత్య పోషకుడు. విరసం సభ్యుడు, ప్రగతిశీల గ్రంధాల ప్రచురణ కర్త, అనేక కార్యక్రమాలకు గుప్తదాత, లక్షల గ్రంథాల్ని కొని లైబ్రరీలకిచ్చేసినవాడు.

వార్తాపత్రికల్లోని బాణామతి, చిల్లంగి, లంకెబిందెలు, క్షుద్రపూజలు' మొదలైన వార్తల్ని

చూసి పర్వత శిఖరాలు దాటి వందలాది వెనకబడిన గిరిజన గ్రామాల్నీ, ఆదివాసీ వారపు సంతల్నీ సందర్శించి చైతన్య సభలు పెట్టినవాడయిన. ప్రజాహితం కోసం జనించే ఏ పనికోసమైనా తన జేబులోంచే ఖర్చుపెట్టి దానికి సంబంధించిన నిర్దిష్టమైన రిజిష్టర్ను ఏ సంవత్సరానికా సంవత్సరం మెయిన్టైన్ చేసారు.

వ్యక్తులు కాదంటేనో సంఘాలు సంకుచితమైతేనో నిబద్ధతగల నిజాయితీపరులు మరుగున పడరు. నిత్యం ఏటికెదురీదిన యాళ్ళ జీవితం రాబోయే తరాలకు స్ఫూర్తిదాయకం.

జనవరి 2016లో ఆయన భావ దీపికలు (నాస్తిక – హేతువాద – భౌతికవాద సూక్తులు) పుస్తకాన్ని నేనే దగ్గరుండి ప్రచురించాను. 2017 ఫిబ్రవరిలో ఇలా ఆయన లేని ఉద్యమాన్ని అకస్మాత్తుగా చూస్తాననుకోలేదు. ప్రపంచ దేశాల యుద్ధకాంక్షని జీవితాంతం వ్యతిరేకించిన మహామేధావి బెట్రాండ్ రస్సెల్ కూడా ఫిబ్రవరి 2నే మరణించాడు. తాను నమ్మిన విలువల్ని పాటించడం కోసం జీవితాంతం ప్రపంచంతోయుద్ధం చేసిన యాళ్ళ కూడా ఫిబ్రవరి 2నే చనిపోవడం కాకతాళీయమే కాని ఆచరణకు నిలువెత్తు ప్రతిరూపమయిన ఆయన జీవితం కొత్తతరాలకు ఆదర్శమవుతుందని ఆశిస్తూ ఈ బాధాకర అక్షరాల్నిక్కడితో ఆపి ఆయనకి నా నివాళి ప్రకటిస్తున్నాను.

# శాస్త్ర ప్రచారమే ఆయన ధ్యేయం !

**యాళ్ళ సూర్యనారాయణ**
**(అమరుడి ఆరవ వర్ధంతి సందర్భంగా)**

"దుష్టత్వాన్ని ఆపడం దేవుడి వల్ల అవ్వడం లేదా? అయితే, అతడు సర్వశక్తిమంతుడు కాదు. లేక ఆపగలిగి ఉండి కూడా దుర్మార్గాన్ని ఆపాలనుకోవడం లేదా ? ఐతే అతడు ద్వేష పూరితమైనవాడౌతాడు. అలాకాక ఆపాలనే అభీష్టమూ ఉండి, ఆపగలిగే శక్తీ ఉన్నట్లు యితే మరి దుష్టత్వం ఎక్కడి నుండి వస్తోంది? ఒకవేళ అతడికి ఆపగల శక్తీ, ఆపాలనే ఉద్దేశం రెండూ లేవా? అటువంటి వాడిని అసలు దేవుడని పిలవడం దేనికి?".

**- ఎపిక్యూరస్**

" దేవుడ్ని నమ్మే మనుషుల పట్ల వ్యక్తిగతంగా నాకేం వ్యతిరేకత లేదు. కానీ దేవుడి పేరుతో మానవ ప్రగతి, సుఖసంతోషాల పై ఆంక్షలు విధించడాన్ని మాత్రం వ్యతిరే కిస్తాను. ఇది ఆస్తికులకూ, నాస్తికులకూ జరిగే పోరాటం కాదు. మానవ స్వాతంత్ర్యంలో విశ్వాసం ఉన్నవారికీ, దాన్ని అణిచి వేయడంలో విశ్వాసం ఉన్నవారికీ మధ్య జరిగే పోరాటం.".

**- ఏ. యస్ .నీల్**

---

"కులనిర్మూలన కు చేయాల్సినవి : 1. కులాన్ని సూచిస్తున్న పేర్లను చట్టం ద్వారా నిషేధించాలి. 2. పెళ్ళి చేసుకునేవారు కులాంతర వివాహాలే చేసుకోవాలి. 3. ఒకే కులంలో పెళ్ళి చేసుకున్న వారికి ప్రభుత్వం సాయం చేయకూడదు. 4. కులాన్ని సూచించే నుదుటి మీద గుర్తుల్ని చట్టం ద్వారా నిషేధించాలి. 5. ఉన్నత పదవులు, పోలీసు ఉద్యోగాలు దళితులకే ఇవ్వాలి. 6. దళితుల కు అగ్రవర్ణాలు నివసిస్తున్నచోటే నివాసాలు కల్పించాలి. 7. అంటరానితనం పాటించని గ్రామాలకు బహుమతులు ఇవ్వాలి. 8. మాల, మాదిగ పల్లెలంటూ దళిత వాడలను రద్దు చేయాలి.".

**- పెరియార్**

---

సైన్సు ప్రచారం కోసం మహనీయుల నిలువెత్తు విగ్రహాలతో , యావత్ దేశంలోనే ఎక్కడా లేని విధంగా, విశాలమైన పచ్చని పచ్చిక మైదానాన్ని సమాజ వైజ్ఞానిక ప్రగతికి అంకితం చేసి, కనీవినీ ఎరుగని రీతిలో ''శాస్త్రీయ ఆలోచనలు పెంపొం దించు దాతృత్వ సంస్థ" పేరిట ఉత్తరాంధ్రలోని పార్వతీపురం చర్చివీధిలో మహోన్నతమైన ఆశయాలతో స్థాపించిన అపూర్వ నిర్మాణకర్త, విస్మరిత భావోద్యమకారుడు యాళ్ళ సూర్య నారాయణ వర్ధంతి ఈ రోజు !

"ఎన్నటికీ మనం తిరగబడలేం కాబట్టి, ఎప్పటికీ మనకి తిరగబడటం చాతకాదు కాబట్టి, మన రక్తం నిండా కులమతాల మాత్రం ప్రవహిస్తోంది కాబట్టి, మనం పిరికి కుక్కలం, పందులం కాబట్టి,మనజీవితాల్ని శాశ్వతంగా కొనేసి పరి పాలిస్తున్న రకరకాల కుష్టు దేవుళ్ళను కొలవడానికే అంకితమవుదాం."

**- నగ్నముని**

---

మానవవాద మార్గానికే మొత్తం జీవితాన్ని అంకితం చేసి, సర్వస్వాన్ని సమాజహితం కొరకే త్యజించిన ఆ

మహనీయుడి మానస పుత్రికైన పార్వతీపురం లోని ఈ ఆశ్రమాన్ని మింగేదానికి ఈసరికే తిమింగలాలెన్నో వేచి ఉన్నాయి. యాళ్ళ జీవిత కాలంలో ప్రచురిం చిన ఏకైక పుస్తకం "భావ దీపికలు (నాస్తిక, హేతువాద, భౌతికవాద సూక్తులు)'' లోవే పైన ఇచ్చిన కొన్ని మహనీయుల వాక్కులు !

కార్ల్ మార్క్స్ మొదలుకొని కవిరాజు త్రిపురనేని వరకూ, మానవేంద్రనాధ రాయ్ మొదలు మేరీ క్యూరీ దాకా, గౌతమ బుద్ధుడు నుండి గురజాడ అప్పారావు మహాకవి వరకూ, మాతా సావిత్రిబాయిపూలే మొదలు, సామినేని ముద్దు నరసింహం దాక, వేమన మొదలు వీరేశలింగం గారి వరకూ, కాటన్ నుండి కోవూర్ వరకూ ఎందరెందరో మహనీయుల మంచిమాటల్ని ఓపికగా ఒక్కదరికి చేర్చి, పుస్తకంగా 'సత్యాన్వేషకు లైన యువతీయువకులకు" ఈ పుస్తకాన్ని ఆయన అంకితం ఇచ్చారు !

ముఖచిత్రంతో కలిపి యాభై పుటల ఈ పుస్తకం ఒక తిరుగులేని భావోద్యమకారుడి ఆశయాలకి అక్షర రూపం. సమసమాజాన్ని కాంక్షించిన ఒక మానవీయ దార్శనికుడి మానసిక ఔన్నత్యానికి విలువైన దర్పణం. మనిషిని ప్రేమించి, మనిషి పక్షాన జీవించి, అమానుషత్వానికి వ్యతిరేకంగా గొంతెత్తి నిలిచిన ఒక సుదీర్ఘమైన తిరుగుబాటు తత్వానికి ప్రత్యక్ష సాక్ష్యం. ఈరోజు ఆయన లేడు, కానీ ఆయన ఆలోచనలు ఉన్నాయి. వాటికి భయపడే జలగలూ ఉన్నారు. ఆ ఆశయాల్ని అధ్యయనం చేసి, ఆచరణా త్మకంగా పాటించేందుకు ప్రయత్నించడమే ఆయనకు మనం ఇచ్చే చిరు నివాళి !

(ఆరేళ్ళ క్రితం నా ముందుమాటతో యాళ్ళ సూర్యనారాయణ ప్రచురించిన 'భావ దీపికలు' పుస్తకం స్కాన్డ్ సాఫ్ట్ కాపీ ఆసక్తి ఉన్న మిత్రులు నా వాట్సప్ నంబర్ 90320 94492 కి రిక్వెస్ట్ పెడితే పంపగలను. ఒక గొప్ప ఆచరణాత్మక యోధుడి గురించి తెలుసుకోగోరే ప్రతి ఒక్కరూ యాళ్ళ జీవితానికి ముగ్ధులవక మానరు. ఈ రోజు యాళ్ళ వర్ధంతి సందర్భంగా ఆ విస్మరిత వీరుని స్మృతిలో నివాళిగా ఈ చిన్న రైటప్.)

# అద్వితీయ భావోద్యమకారుడు !

**విజ్ఞాన శాస్త్ర ప్రచారోద్యమ ధీరుడు !!**
**యాళ్ళ సూర్యనారాయణ !!!**

దేశం మొత్తం మీద ఎక్కడా లేని విధంగా సామాజిక శాస్త్రజ్ఞులు,విజ్ఞానవేత్తల ఎత్తైన విగ్రహాలతో శాస్త్ర ప్రచారం కోసమే స్థాపించ బడ్డ "శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించు దాతృత్వ సంస్థ" ఉత్తరాంధ్రలోని పార్వతీ పురం చర్చివీధిలో ఉంది. సుమారు ఒకెకరం స్థలంలో వ్యవస్థ కోసం కృషి చేసిన మహ నీయుల అల్లంత విగ్రహాలు, ఆయా వ్యక్తుల సంక్షిప్త పరిచయంతో ఉన్న అరుదైన భావోద్యమ స్థలమది. దాని వ్యవస్థాపకులే కీ.శే.యాళ్ళ సూర్యనారాయణ, సరస్వతమ్మ దంపతులు !

భారత రాజ్యాంగంలోని 51 A (h) ప్రకారం పౌరసమాజంలో "శాస్త్రీయ స్పృహను, మానవవాదాన్నీ, పరిశీలనాతత్వాన్నీ, సంస్కరణాభిలాషను పెంపొందించడం ప్రతీ భారతీయ పౌరుడి విధి" అనే దృక్పథాన్ని కలిగి జీవితాంతం అందుకోసం నిరంతరం తపించి, దేశంలో ఎక్కడా లేని విధంగా సైన్సు ప్రచారం కోసమే ప్రత్యేకంగా యాళ్ళ సూర్య నారాయణ దంపతులు పెట్టిందే, "శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించే దాతృత్వ సంస్థ." !

భారతీయ సాంస్కృతికోద్యమ పితామహులు జోతిబాఫూలే, సావిత్రీబాయి దంపతులతో మొదలెట్టి జీవితాంతం బ్రాహ్మణవాదంతో ఎదురులేని పోరాటం చేసిన పెరియార్ రామస్వామి నాయకర్ వరకూ, సత్యాన్వేషణా తృష్ణకి తిరుగులేని దిక్సూచి మహాత్మా గౌతమ బుద్ధుడి నుండి కులనిర్మూలన కోసం ఎనలేని కృషి చేసిన భారతరత్న , భారత రాజ్యాంగ నిర్మాత డా. బాబాసాహెబ్ అంబేద్కర్ వరకూ మనకి అక్కడ తారసపడతారు !

అంతేకాదు, ప్రపంచ పీడిత ప్రజానీకానికి మార్గదర్శి కార్ల్ మార్క్స్ మొదలుకొని వైజ్ఞానికోద్యమ దిశనే మార్చిన చార్లెస్ డార్విన్ వరకూ, భిన్నాభిప్రాయానికి స్థానం ఉండాలని మృత్యువుని చిరునవ్వుతో ఆహ్వానించిన తత్వవేత్త సోక్రటీసు నుండి సత్యస్థాపన కోసం ఉన్మాదానికి బలైపోయిన బ్రూనో దాకా, గెలీలియో నుంచి మేడమ్ క్యూరీ దాకా ఇంకా వైజ్ఞానిక వేత్త ఐన్ స్టీన్, అమరుడు సర్దార్ భగత్ సింగ్, తొలి తెలుగు భావోద్యమ కవి వేమన ఇలా మొత్తం 18 మంది మహామహులు !

విభిన్న రంగాల్లో ప్రజానీకం కోసం జీవితాలని అంకితం చేసిన యోధుల్ని విద్యార్థులు, యువతకి పరిచయం చేయా లనే సంకల్పంతో, వైవిధ్యమైన స్రవంతులకి చెందిన 18 మంది ప్రజాతంత్ర యోధుల్ని ఎంచు కుని, వారి నిలువెత్తు విగ్రహాలు పెట్టడమే కాకుండా, వారి కోసం రేఖామాత్రపు పరిచయంకూడా చేస్తూ, ప్రతి విగ్రహానికి కిందన తెలుగులో సమాచారం రాయించి అతి త్వరలోనే ఆ ప్రదేశంలో ఒక అద్వితీయ మైన గ్రంథాలయం స్థాపించాలని ఆ దంపతులు కలకన్నారు !

అనుకోని అనారోగ్యంతో సూర్యనారాయణ 2017 లో మరణించడంతో ఆ స్థలం అన్యాక్రాంతమైంది. సరస్వత మ్మ కూడా మొన్నీ మధ్యనే మరణించారని తెలిసింది. దాంతో ఆయన పేరిట ఉన్న వ్యవసాయ భూమిని, యాళ్ళ ఎన్నో ఆశయాలతో స్థాపించిన ఈ

ఆశ్రమాన్ని ముష్కరమూకలు మేయడానికి పథకం పన్నాయి. ప్రస్తుతం కోర్టు వివాదాల్లో చిక్కుకున్న ఈ సంస్థని యాళ్ళ కోరిక మేరకు ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటే మంచిది !

తాము కలలుకన్న నిర్మాణానికి కించిత్తు కుటుంబ స్వార్థం కూడా అడ్డంకేనని తలచి స్వచ్ఛందంగా పిల్లల్ని కనడమే మానేసిన మహనీయ దంప తులు వారిరువురూ. అలాంటి వారి ఆశయాలకి తూట్లు పొడుస్తూ డబ్బుకోసం ఏ గడ్డయినా కరిచే వారి పాలవ కుండా ఆ మహోన్నత శాస్త్రీయ సంస్థను కాపాడుకోవడం తెలుగులో సైన్సుసంఘాలే కాదు,హేతువాద,నాస్తిక,భౌతికవాద, మానవ వాద,దళితబహుజన,వామపక్ష, ప్రగతి శీల,ప్రజాస్వామ్య సంఘాలన్నింటి కర్తవ్యం !

వయసుకు మించిన చనువుతో ఆయన దగ్గర ఎన్ని గారాలు పోయానో తల్చుకుంటే ఇప్పుడు ఏడుపొస్తుంది. అర్ధరాత్రి ఊరు చేరినప్పటికీ ఇబ్బంది పెట్టడం ఇష్టం లేక తెల్లవారుజాము వరకూ స్టేషనులో పడుకొని ఉదయం ఇంటికి వచ్చి కనీసం టీ కూడా తాగకుండా పుస్తకాలేవో నాకిమ్మనమని అందజేసి వెళ్ళిపోయిన ఈ పెద్దాయనను తల్చుకుని ఇప్పటికీ ఆశ్చర్యం పోతుంటారు కుటుంబ సభ్యులు !

నాన్నది పార్వతీపురం, యాళ్ళ దీ అదే ప్రాంతం కావడం తో నేనెప్పుడు అటు వైపెళ్ళినా ఆయన్ని కలవకుండా వచ్చే వాడ్ని కాదు. అలాంటి మనిషి ని మళ్ళీ కచ్చితంగా చూడలేం. అంతటి నిజాయితీ, నిబద్ధత, నిర్భీతి, నిర్మొహమాటం, నిక్కచ్చితనం, ధైర్యం ఆయన తో పరిచయం దానికదే ఒక విద్యాభ్యాసం. జీవితాంతం ఆయన కోర్టులతో, సమాజంతో చేసిన పోరాటాల్లో నూ వందల వేల అనుభవాల్ని నేనెన్నిసార్లు మొత్తుకున్నా అక్షరరూపంలో సైతం మనకి అందించకుండా వెళ్ళిపోయిన ఆయనంటే ఆప్యాయతతో కూడిన కోపం నాకు !


అనితరసాధ్యమైన రీతిలో సైన్సు ఉద్యమాని కి వెన్ను దన్నుగా, భావోద్యమాలకి బలమైన భరోసాగా ఉంటూ నాస్తిక, హేతువాద, భౌతికవాద సూక్తుల్ని, వాక్యాల్ని ఒక్క దరికి చేర్చి శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించు దాతృత్వ సంస్థ మొట్టమొదటి ప్రచురణగా రాజమండ్రిలో ప్రచురించాం. బౌద్ధోద్యమ కారుల ఇంటర్వ్యూలు అప్పట్లో 'సద్ధమ్మ స్వరాలు' పుస్తకంలో అనుబంధంగా చేర్చిన దేవగుప్తపు పేర్లింగమ్, యాళ్ళ సూర్య నారాయణ ఇంటర్వ్యూలు ఎంతో విలువైనవి !

భావోద్యమ సైన్సు ప్రచార సంఘాలు, ఇతరేతర ప్రజా సంఘాలు ఇకనైనా పూనుకుని మహత్తర ప్రజా ప్రయోజనం కోసం యాళ్ళ దంపతులు స్థాపించిన మహాసంస్థ 'శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించు దాతృత్వ సంస్థ' ను సమిష్టిగా కాపాడుకోవడం కోసం కనీస ప్రయత్నంగా ఒక యాక్షన్ కమిటీగా ఏర్పడటం ఈనాటి అవసరం అని ఎంతో మంది దగ్గర మొత్తు కున్నా ప్రయోజనం లేదు కాన, సైన్సు కార్యకర్తలు, ప్రజాతంత్ర వాదులు కనీసం ఉత్తరాంధ్రలో ఉన్న ప్రజా సంఘాల నాయకులు త్వరలో మాయం కానున్న ఆ మహా సంస్థని ఒకసారి దర్శించి వీలుంటే తరించ మనవి !

(అర్ధరాత్రి, అపరాత్రని లేకుండా అనేకసార్లు నాకు ఆతిథ్యం ఇచ్చి, ఇప్పటికే శిథిలావస్థ లోకి వెళ్ళిపోయిన ఆ సంస్థ ను చూసి రమ్మనమని అటువైపు వెళ్ళే అందరికీ చెబుతుంటాను. యాళ్ళ సూర్యనారాయణ

మరణించిన ఐదేళ్ళ తరువాత ఏదో అనాధ ఆశ్రమంలో ఉన్న సరస్వతమ్మ గారు కూడా మొన్నీమధ్యనే మరణించారని తెలిసింది. ప్రజలకోసం జీవితాన్ని త్యాగం చేసిన యాళ్ళ విరసం మొదలు హేతువాద సంఘాలవరకూ అనేక ప్రజాసంఘాలకి సానుభూతిపరుడు. పార్వతీపురం కుట్రకేసులో ముద్దాయి. తెలుగులో లెక్క లేనన్ని సంఘాలకి గుప్తదాత. తమ సంఘంలో సభ్యుడు కాదన్న కారణంతో తెలుగులోని భావోద్యమ ప్రజాసంఘాలు ఆయన చేసిన కృషిని గుర్తించకపోవడం, నక్కల పాలు కానున్న ఆయన సంస్థని కనీసం కాపాడు కునేందుకు ముందుకు రాక పోవడం వాటిలో గూడు కట్టుకున్న అపారమైన సంకుచిత త్వానికి ప్రతీకని పేర్కొంటూ సరస్వతమ్మ కి అశ్రు నివాళుల తో ఈ చిన్న రైటప్.)

– గౌరవ్




యాళ్ల సూర్యనారాయణ గారి ఏకైక ప్రచురణ

# వారిరువురూ ఏకవ్యక్తి సైన్యాలు !

**యాళ్ళ సూర్యనారాయణ, పార్వతమ్మ**
**(దేశంలోనే అరుదైన వైజ్ఞానికసంస్థ పరిచయం)**

ఉత్తరాంధ్ర పార్వతీపురం టౌన్లోని చర్చివీధిలో శ్రమశక్తి నగర్లో ఉంటుంది ఆ ఆశ్రమం. ఎందరో ఆలోచనా పరులకీ, ప్రజాపక్ష బుద్ధి జీవులకీ ఒకనాడు నెలవైన ఆ చోటు ప్రస్తుతానికో పాడుబడిన ప్రదేశం. ఎవరికీ కాకుండా అయిపోతున్న అన్యాక్రాంతం. వంటి మీద వేసుకున్న జత, ఇంట్లో ఇంకొక జత,గుడ్డ సంచీ, చిరుగుల చీరలు రెండు, రెండు గ్లాసులు, ఓ రెండు కంచాలు, రెండే దుప్పట్లు, ఇవన్నీ పెట్టుకోడానికో పెద్ద పెట్టె. అర్ధరాత్రి, అపరాత్రి నేనొచ్చినప్పుడు ఆదరించే ఇరువురు మనుషులు. ఇప్పుడెవరూ లేరు, ఇక రారు ! కీ.శే.యాళ్ళసూర్యనారాయణ,పార్వతమ్మ

ఈ దేశంలో చార్లెస్ డార్విన్, సోక్రటీసు, కార్ల మార్క్స్, మేడమ్ క్యూరీ, ఐన్ స్టీన్, బ్రూనో, గెలీలియో వంటి ప్రపంచ చరిత్రనే మలుపు తిప్పిన అనేక దేశాలకి చెందిన మహామహుల ఆశయాల కోసం నిర్మించిన ఒక ఆశ్రమం ఉందనే విషయం మీకు తెలుసా ?మాతా సావిత్రీ బాయి, మహాత్మా జోతిరావ్ పూలే, పెరియార్ రామ స్వామి, బుద్ధుడు, డా. బి. ఆర్. అంబేద్కర్, ప్రజాకవి వేమన, డా.ఎ.టి.కోవూర్, సర్దార్ భగత్సింగ్, గోరా, త్రిపురనేని రామస్వామి వంటి అద్వితీయ వ్యక్తులకోసం కట్టబడిన నిర్మాణం !

ఒక ఎకరం స్థలంలో ఇంత మంది మహామహుల నిలు వెత్తు విగ్రహాలు పెట్టి వైజ్ఞానిక మానవీయ స్ఫూర్తికోసం అహర్నిశలూ కష్టపడి హఠాత్తుగా చనిపోయిన ఒక బహుజన ప్రగతిశీల మేధావి,తిరుగులేని భావోద్యమ కార్యకర్త,నీతీ, నిజా లయితీ, నిబద్ధత కలిగిన వ్యక్తి గురించి చదివారా ?ఇప్పుడీ ఇద్దరూ ఈ భూమ్మీద లేరు. కానీ, వారు స్వప్నించిన ఆశయాల సాధన కోసం కష్టించిన భూమి మాత్రం అక్రమార్కుల చేతుల్లో ఉంది. 'శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించు దాతృత్వ సంస్థ' వ్యవస్థాపకులైన ఆ మహనీయుల కృషి అన్యాయంగా మరుగున పడింది ! అక్కడున్న విగ్రహాల్లో సగానికి పైగా తెలుగు రాష్ట్రాల మాట టుంచి అసలీ దేశంలోని ఏ ప్రాంతంలోనూ లేవు. విద్యార్థులు,యువతకి మార్గదర్శకంగా ఆ స్థలాన్ని ఒక బహుజన సాంస్కృతికోద్యమ కేంద్రం గానూ, సైన్స్ సెంటర్ గా, మంచి గ్రంథాలయంగా మలచాలనే మహత్తరమైన ఆశయం వారిది.అలాంటిది ఈ రోజు తుప్పలాక్ర మించిన గేటు చూసి ఏడుపొచ్చేసింది. ఈ దేశపు పీడిత వర్గాలకి దిశా నిర్దేశం చేసే అంబేద్కర్ విగ్రహం చూపుడు వేలును కూడా విరిచేసారు. ఆశ్రమం అంతా పిచ్చి మొక్కలు. బోర్డే నాడో పీకి అవతల పారేసారు. ఆశయాల్ని హత్య చేసారు !

సుమారు పదిహేనెకరాల ఆసామి. ప్రభుత్వ నౌకరీలోంచి రిటైరయ్యాడు. సామాజిక సేవకుఅడ్డంకని ఆ దంపతులు పిల్లల్ని కూడా కనకుండా కలలు నిర్మించుకున్నారు. ఇప్పుడా కలలన్నీ ధ్వంసం కాబడ్డాయి. ఆశలన్నీ నాశనం చేబడ్డాయ్. స్వార్థమొక్కటే మిగిలింది. వాళ్ళ తదనంతరం దానిని ప్రభుత్వపరం చేయాలని తపించిన యాళ్ళ దంపతుల కోరికకు వారిరు

పురూ చెప్పిన మాటలే సాక్ష్యం.నేను చేసిన ఇంటర్వ్యూ, ప్రచురించిన ఆయన పుస్తకమే సాక్ష్యం. జీవితాంతం వారిరు పురూ చేసిన అవిశ్రాంత యుద్ధాలే సాక్ష్యం !

వారి కలల రూపమైన ఆ ఆశ్రమం కూడా ఇక ఎంతో కాలం ఉండకపోవచ్చు. ఇప్పటికే యాళ్ళ ఇంటిని కార్లు పెట్టుకునే షెడ్డుగా చేసేసారు. ఎన్నో జ్ఞాపకాల్ని అమానుషం గా చెరిపేసారు. ఆయన సేకరించిన పుస్తకాలు, ఫైళ్ళ ఊసే లేదు.ఇప్పుడు అక్కడ స్మశాన నిశబ్దం, మన స్తబ్దత. ప్రగతిశీల సంఘాలు, దళిత బహుజనోద్యమ సంస్థలు దయచేసి దృష్టి సారించి కాపాడుకుని తీరాల్సిన ఆశ్రమం అది. అంతటి అరుదైన ప్రదేశాన్ని కనుక నిలుపుకోడంలో విఫలమైతే

ఆశయసాధనలో సఫలత్వానికి ఇక చోటులేదు!

(ఇంతకంటే రాయలేను. ఈ దేశంలో అసమానతల అంతం కోసం బహుజనుల హితం కోసం, సమసమాజం కోసం, సామాజిక న్యాయం కోసం అద్భుతమైన ఆశ్రమాన్ని నిర్మించిన యాళ్ళ దంపతుల కు నా జోహారులు.అభ్యుదయ ముసుగులు ధరించిన వారి నుండి అమ్ముడుపోయిన అధికారులు, అగ్రశ్రేణి నాయకులుగా ఈరోజు చెలామణీ అవుతున్న వారి వరకూ, ఆయన నుండి పొందిన లబ్ధి, ఆయన పట్ల చూపు తున్న వివక్ష కాలం గుర్తిస్తూనే ఉంది. యాళ్ళ దంపతుల త్యాగానికి మనతరం చేసిన ద్రోహాన్ని భావి తరాలకు ప్రసరింప జేస్తూనే ఉంటుంది. నిర్లజ్జగా, నిస్సహాయ కన్నీటి నివాళులు ! )

– గౌరవ్

## మేకా సత్యనారాయణ శాస్త్రి (బాంబు) స్మృతి చిహ్నంగా ఇప్పటివరకూ ప్రచురించిన పుస్తకాలు

1. ఒకే వ్యక్తి – అనేక జీవితాలు : రాహుల్ సాంకృత్యాయన్ (వ్యాస సంకలనం)
2. పర్యావరణ పరిరక్షణ: శాంతికీ, సంతోషానికి, సం తృప్తికీ మార్గం – సుందర్లాల్ బహుగుణ
3. మన కర్తవ్య మార్గం :మాన వీయ, రాజకీయ,సామాజిక, ఆర్థిక జీవన పాశ్వాలు – బాబా సోహన్ సింగ్ భాక్నా.
4. సైన్స్ అంటే ఏమిటి ? పిల్లల కోసం విజ్ఞాన శాస్త్రం కథ – వినోద్ రైనా, డి.పి. సింగ్.
5. పిఠాపురం మహారాజా శ్రీ ఆర్. వి. కె. ఎమ్. సూర్యారావు బహదూర్ – ఐ.వి. చలపతిరావు
6. మహాత్మాగాంధీ : డా. సచ్చిదానంద సిన్హా
7. ప్రజాపక్ష మేధావి – ప్రత్యామ్నాయ చరిత్రకారుడు డి.డి. కొశాంబి : అరవింద్ గుప్తా
8. కాకినాడలో ఒక సాంఘిక సంస్కరణ :యలమంచిలి వెంకటప్పయ్య
9. నాకో భార్య కావాలి : జడీ బ్రాడీ
10. ప్రజల కోసం పాత్రికేయం : ప్రమాణాలు – ప్రభావాలు (వ్యాస సంకలనం)
11. ఏకవ్యక్తి సైన్యం – మేకా సత్యనారాయణ శాస్త్రి (బాంబు)
12. పిఠాపురానికి వెలుగురేఖలు: ముగ్గురు మహనీయుల శతజయంత్యుత్సవ పరిచయం.

**వివరాలకు**
**మేకా సత్యనారాయణ శాస్త్రి (బాంబు) స్మారక వేదిక,**
పిఠాపురం, కాకినాడ జిల్లా.